క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బూర్గంపాడు: సారపాకలోని భాస్కర్‌నగర్, విజయనగర్, రాజీవ్‌నగర్, సాయిరామ్ స్కూల్ ఏరియాలలో శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ తెలిపారు. గురువారం ఓ ప్రకటనలో.. ఈ ప్రాంతాలలో విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు పనులు జరుగుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం ఫీడర్‌లో లైన్ మరమ్మతుల కారణంగా జగ్గారం, మిట్టగూడెం, కొమ్ముగూడెం, తురుములగూడెం తండా, మంచికంటినగర్, అణుశక్తినగర్ గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుండాలలో భారీ వర్షం

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం నుంచి మొదలుకొని ఎడతెరిపిలేకుండా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. భారీ వృక్షాలు నేలరాలాయి. కరెంటుకు అంతరాయం ఏర్పడింది. లోతట్టుప్రాంతాలు జలమయం అయ్యాయి. వానకు వాగులు సైతం కొంచెం పారాయి. గుండాల, ఆళ్లపల్లి మండల కేంద్రాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో బీభత్సమైన వాన కురిసింది. ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రాలేని పరిస్థితి. రాకపోకలకు సైతం అంతరాయం ఏర్పడింది.

జాతర ప్రారంభం

దమ్మపేట: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవమును, రేపటి (శనివారం) నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు చిన్నశెట్టి రమేష్, గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దమ్మపేట గ్రామంలోని ముత్యాలమ్మతల్లి ఆలయ సమీపంలో జాతర ఉత్సవాలు శనివారం నుంచి ఐదు రోజులపాటు జరుగనున్నట్లు వివరించారు. ముత్యాలమ్మకు ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటుగా ఉత్సవాల్లో సినిమాల ప్రదర్శన, మ్యూజికల్ నైట్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లుగా వెల్లడించారు. మండల పరిధిలోని ప్రజలు జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తహసీల్దార్‌కు వినతి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో దోభి ఘాట్ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రజకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. 2005లో అప్పటి ప్రభుత్వం దోభి ఘాట్ నిర్మించి సమీకృత మరుగుదొడ్డి నిర్మించిందని గ్రామపెద్దలు, అధికారులు దోభి ఘాట్ చుట్టూ పక్కల నాలుగు ఎకరాల భూమి రజకులకు చెందుతుందని చెప్పారని వెల్లడించారు. ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించారని, పంచాయతీ వారు శ్మశానవాటిక, డంపింగ్ యార్డు, నర్సరీ దోభీ ఘాట్ స్థలంలో నిర్మించారని రజకులు తహసీల్దార్‌కు విన్నవించారు. అధికారులకు పదే పదే విన్నవించినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా సానుకూలంగా ఆర్డర్ వచ్చిందని.. దోభి ఘాట్ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి విడిపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నాయకుల పరామర్శ

ములకలపల్లి: పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కరుటూరి కృష్ణను వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. కృష్ణ తల్లి సీతమ్మ ఇటీవల మరణించగా.. గురువారం పూసుగూడెంలో దశదిన ఖర్మ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కృష్ణ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, పర్వతనేని అమర్‌నాథ్, పువ్వాల మంగపతి, బాల అప్పారావు, పుష్పాల చందర్‌రావు, శనగపాటి రవి, గాడి తిరుపతిరెడ్డి, బిక్కుమళ్ల సుధాకర్, అడపా నాగేశ్వరరావు, నందమూరి సురేశ్, కుంచారపు శ్రీనివాస్, బొమ్మకంటి కామేశ్, తన్నీరు నాగయ్య, నల్లమోతు జగదీశ్, సురభి రాజేశ్, కటికనేని అదిత్య, సొసైటీ సీఈఓ మురళి తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: నేడు మండలంలోని సాయినగర్ ప్రాంతంలోని కిన్నెర కల్యాణ మండపంలో నేడు నిర్వహించే ఎమ్మెల్సీ పట్టభద్రుల పినపాక నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విజ్ఞప్తి చేశారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ రాకేష్‌రెడ్డి హాజరు కానున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ పట్టభద్ర ఓటర్లు, పార్టీ మండల, పట్టణ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీల్లో ఖజానా ఖాళీ

- గ్రామాల్లో పనుల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు
- సిబ్బంది వేతనాల చెల్లింపులకూ వెతుకులాటే..
- నాలుగు నెలలుగా నెట్టుకొస్తున్న కార్యదర్శులు


అంజనాపురం గ్రామపంచాయతీ కార్యాలయం

బూర్గంపాడు: గ్రామపంచాయతీల ఖజానా ఖాళీ అయింది. నిధుల లేమితో గ్రామాలలో అత్యవసరంగా చేయాల్సిన పనులు కూడా కుంటుపడుతున్నాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా చేపట్టాల్సిన పనులకు పైసలు లేకపోవటంతో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గ్రామాల్లో చేయాల్సిన పనులివే..

గ్రామాలలో తాగునీటి పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. డ్రెయినేజీలలో పూడిక పనులు, చేతిపంపుల రిపేర్లు చేయాల్సి ఉంది. గ్రామాలలోని వీధిలైట్లు, బ్లీచింగ్ కొనుగోలు చేసేందుకు నిధుల కొరత ఏర్పడింది. గ్రామాల్లో కోతుల బెడద విపరీతంగా ఉంది. మే నెలలోనే కోతులను పట్టుకోవటం గాని, అటవీ ప్రాంతాలకు తరిమే పనులు చేయాలి.జూన్‌లో వర్షాలు కురిసి పంటలు సాగు చేస్తే కోతులు తరమటం సాధ్యపడదు. గ్రామాలలోని మట్టి రోడ్లకు గ్రావెల్ తోలిస్తే తప్ప వర్షాకాలం నడిచేందుకు కూడా వీలుకాదు. ఇలాంటి పరిస్థితులో పనులు నిర్వహించేందుకు గ్రామపంచాయతీలలో నిధులు లేవు. గ్రామపంచాయతీలలో పనిచేసే మల్టి పర్పస్ వర్కర్లకు నెలనెలా వేతనాలు ఇచ్చేందుకు కూడా కొన్ని గ్రామపంచాయతీల్లో కటకటగానే ఉంది. రోజు ఇళ్ల నుంచి చెత్తను సేకరించే ట్రాక్టర్లకు డీజిల్, మెయింటెనెన్స్‌కు కూడా ఆర్థిక ఇబ్బందులు తప్పటం లేదు.అదేవిధంగా గ్రామాలలోని నర్సరీల నిర్వహణ కూడా ఇబ్బందికరంగా మారింది.ఈ పరిస్థితులు గ్రామపంచాయతీ కార్యదర్శులపై ఆర్థికభారం మోపుతున్నాయి. అత్యవసర పనులకు గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ జేబులో డబ్బులు పెట్టి పనులు చేయించాల్సి వస్తుంది.

జనవరి నెలలో కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు కొద్దిమేరా గ్రామపంచాయతీ ఖాతాలలో జమయ్యాయి. ఆ నిధులతోనే గ్రామపంచాయతీ కార్యదర్శులు గత ఐదు నెలలుగా నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధులు 15 నెలలుగా విడుదల కాలేదు. గతంలో సర్పంచ్‌లు చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించాల్సి వుంది. అదేవిధంగా బ్లీచింగ్, వీధిలైట్లు, చేతిపంపుల సామాగ్రి కొనుగోలుకు సంబంధించి దుకాణాలలో బిల్లులు చెల్లించాల్సి వుంది. సామగ్రి ఇచ్చిన దుకాణాదారులు బిల్లుల కోసం గ్రామపంచాయతీల చుట్టు తిరుగుతున్నారు. గ్రామాలలో చెత్త సేకరణకు, మొక్కలకు నీరు పట్టేందుకు కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రక్కు, ట్యాంకర్లకు సంబంధించి తీసుకున్న ఫైనాన్స్ కిస్తీలను కూడా కొన్ని గ్రామపంచాయతీలు చెల్లించలేనటువంటి పరిస్థితులున్నాయి. గతంలో గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించిన కాంట్రాక్టర్లు కూడా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.

పడకేసిన ప్రత్యేకాధికారుల పాలన..

ఈ ఏడాది జనవరి నెలాఖరుకు సర్పంచ్‌లు, పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. గ్రామాలలో పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే ప్రత్యేక అధికారులు మాత్రం గ్రామపంచాయతీలను పెద్దగా పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదో మొక్కుబడిగా వారానికి, పదిరోజులు గ్రామపంచాయతీ కార్యాలయాలకు వచ్చి వెళ్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీలలో ఏమైనా అత్యవసర పనులుంటే కార్యదర్శులపైనే ప్రత్యేక అధికారులు భారం మోపుతున్నారు. అత్యవసర పనులకు కార్యదర్శులు అప్పులు చేసి పనులు జరిపిస్తున్నారు.

పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం జనవరిలో ముగిసింది. ఫిబ్రవరి 2న ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది.గ్రామపంచాయతీల పరిపాలన, పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. నిధుల వినియోగానికి గ్రామపంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రత్యేక అధికారులకు చెక్‌పవర్ ఇచ్చారు.అయితే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవటంతో ప్రత్యేక అధికారులు ఏమీ చేయలేనటువంటి పరిస్థితులేర్పడ్డాయి. పనులు చేయించటానికి నిధులు లేకపోవటంతో ప్రత్యేక అధికారులు పంచాయతీ పాలనను పెద్దగా పట్టించుకోవటం లేదు. దీంతో పూర్తిస్థాయిలో బాధ్యతలు గ్రామపంచాయతీ కార్యదర్శులపైనే పడుతోంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు

గ్రామపంచాయతీలలో పనుల నిర్వహణకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. 15వ ఆర్థికసంఘం నిధులు, జనరల్ ఫండ్స్‌తో పనులు జరిపిస్తున్నాం. ఎస్ఎఫ్‌సీ నిధులు రావాల్సి ఉంది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత నిధులు జమయ్యే అవకాశాలున్నాయి.

– చంద్రమౌళి, జిల్లా పంచాయతీ అధికారి

నిఘాతో నేరాల నియంత్రణ


మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రహెమాన్

చంద్రుగొండ: నేరాల నియంత్రణపై నిఘా పెంచాలని డీఎస్పీ అబ్దుల్ రహెమాన్ పోలీసులకు సూచించారు. చంద్రుగొండ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి జూలూరుపాడు సర్కిల్ క్రైం మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేయాలన్నారు. క్రైం రేట్ తగ్గేలా పనిచేయాలన్నారు. రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో జూదం ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు మాచినేని రవి, జీవన్ రాజు, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, అశ్వారావుపేటలో షిరిడి సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సదర్భంగా ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు చేరుకొని బాబాను దర్శించుకున్నారు. అలాగే నైవేద్యాలు సమర్పించి, క్షీరాభిషేకాలు చేశారు. అలాగే ఆలయాల్లో మధ్యాహ్నం భక్తులకు, పేదలకు అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

రైతులకు బోనస్ చెల్లించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ పోశం నర్సింహారావు

మణుగూరురూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పోశం నర్సింహారావు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణ మాఫీలు, పంట బోనస్ వంటివి అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నేటికి అమలు చేయడం లేదన్నారు. ఇటీవల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, ఎంపీటీసీ కణితి బాబురావు, నాయకులు వల్లభనేని రమణ, ఆర్.వెంకటరెడ్డి, ముద్దంగుల కృష్ణ, ఎడవల్లి వెంకటయ్య, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీటీసీపై కేసు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాద ఘటనపై ఇరువర్గాలు చేసుకున్న ఫిర్యాదుతో కేసులు నమోదయ్యాయి. అలాగే, ఈ ఘటనలో జోక్యం చేసుకుని దుర్భాషలాడిన టీడీపీ ఎంపీటీసీపైనా కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లికి చెందిన వృద్ధుడు ఎ.భద్రయ్య ఈనెల 9వ తేదీన పొలం నుంచి సైకిల్‌పై ఇంటికి వస్తుండగా కొండపల్లి లక్ష్మీనారాయణ ద్విచక్రవాహనం అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనపై భద్రయ్య కుమారుడి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేశారు. అయితే, ఊట్లపల్లికి చెందిన టీడీపీ ఎంపీటీసీ కార్తిక రామకృష్ణ రాజీ చేస్తానని పిలిచి తనను దుర్భాషలాడటంతోపాటు బెదిరించాడని లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి


బూర్గంపాడు: ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ముస్లిం పెద్దలు

బూర్గంపాడు: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలంగాణ ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గీత అన్నారు. సారపాకలోని మసీద్ ఏ దావత్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివి టెన్త్, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీత మాట్లాడుతు మైనార్టీ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మైనార్టీ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు, ప్రజలు సహకరించాలని కోరారు. మజీద్ కమిటీ సభ్యులు మహబూబ్ అలీ, తాజుద్దీన్,రజాక్, ముస్తాఫా, రిటైర్డ్ ఎంఈఓ ఖాసీం, అబ్దుల్ రహీమ్, షఫీ, పాషా, ఆశిక్, బషారత్ తదితరులున్నారు.

అశ్వాపురం: పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను మండల కేంద్రంలో కాల్వ బజార్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు వారి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఎస్ఎస్‌సీ, సీబీఎస్‌సీలో మంచి మార్కులు సాధించిన పది మంది విద్యార్థులకు సన్మానం చేశారు. సీబీఎస్ఈలో అత్యధిక మార్కులు సాధించిన జశ్విత, మాలతి, చరణ్‌తో పాటు ఎస్ఎస్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన గణేష్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు లయన్స్‌క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ పిల్లారిశెట్టి హరిబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్, లయన్స్‌క్లబ్ జోనల్ ప్రెసిడెంట్ తారా ప్రసాద్, ప్రెసిడెంట్ పూర్ణచందర్‌రావు, మీరా హుస్సేన్, అడబాల నాగేశ్వరరావు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వాలి


దుమ్ముగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘం నాయకుడు దేవయ్య

భద్రాచలంటౌన్: రాష్ట్రవ్యాప్తంగా త్వరలో చేపట్టబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో మున్నూరు కాపులకు దామాషా ప్రకారం టికెట్లు కేటాయించే విధంగా రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. భద్రాచలం పట్టణంలో గురువారం మున్నూరు కాపు సంఘం నాయకులు గెలుపు కోసం నిర్వహించే చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపుల హక్కులను పొందడం కోసం ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టినటువంటి చైతన్య యాత్ర భద్రాచలం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. సమావేశం నియోజక వర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పి.రాజశేఖర్, తమ్మళ్ల వెంకటేశ్వరరావు, వల్లాల ప్రసాదరావు, ప్రకాష్ రావు, వాసాల వెంకటేశ్వరరావు, ఆది కోటేశ్వరరావు, వరాల వేణు, లంక నరసింహరావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని చిన్న బండి రేవు గ్రామంలో మున్నూరు కాపు సంఘం సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, రాష్ట్ర కార్యదర్శి వలాల ప్రసాదరావు, జిల్లా కన్వీనర్ ఆది కోటేశ్వరరావు, జిల్లా రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ వాసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భవిష్యత్తులో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికంగా ఔత్సాహికులు కుల సోదరులను రాజకీయంగా పోటీ చేయించి గెలిపించుకోవాల్సిందిగా సూచించారు. అలాగే మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ కార్పొరేషన్ నుంచి విడుదలైనటువంటి నిధులు ఏ విధంగా కులానికి కుల సభ్యులకు అవసరమో ప్రణాళిక రూపొందిస్తామన్నారు. విద్యార్థులు, మహిళలు, చిరు వ్యాపారులు వంటి వారందరికీ అన్ని విధాలా ఉపయోగపడే విధంగా విధి విధానాలు రూపొందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు లంక నరసింహారావు, తారక రామారావు, ధనపనేని వెంకటేశ్వరరావు, జక్కుల శ్యాంసుందర్, వారాల వేణు, పూదోట సూరిబాబు, అగ్గి రాములు, దేవన్న, పత్తివాడ జగదీష్, లంక శ్రీనివాసరావు, బిల్లా చంద్రశేఖర్, కొమ్ము బాలకృష్ణ, మంద హరిబాబు, పాశం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి విగ్రహావిష్కరణ


దమ్మపేటలో విగ్రహావిష్కరణలో పాల్గొన్న కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ, సీపీఎం నాయకులు

దమ్మపేట: ఇటీవలే మృతి చెందిన చెందిన సీపీఐ జిల్లా నాయకుడి గుర్తుగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర నాయకులు కూనంనేని సాంబశివరావు గురువారం ఆవిష్కరించారు. మండల కేంద్రం, దమ్మపేట గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు, ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. భాస్కరరావు స్మృతి చిహ్నంగా పార్టీ స్తూపంతో పాటుగా ఆయన విగ్రహాన్ని పార్టీ, కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేశారు. గురువారం మృతుడి దశదిన కర్మ సందర్భంగా ఆయన విగ్రహాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే, స్తూపాన్ని సీపీఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భాస్కరరావు మృతి పార్టీకీ తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షాబీర్ పాషా, నరాటి ప్రసాద్, సీపీఎం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, టీడీపీ నాయకులు వలీపాషా, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను మెజార్టీతో గెలిపించాలి

అశ్వాపురం: నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పది ఏండ్లుగా కేసీఆర్ అవినీతి పాలనపై రాజీలేని పోరాటం చేసి ప్రశ్నించే గొంతుకగా నిలిచి పేదల కోసం పోరాడే జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్నను పట్టభద్రులు ఆశీర్వదించి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ బట్టా సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి రమేష్‌బాబు, వెంగల సోమిరెడ్డి, గొల్లపల్లి నరేష్, కోలా శశికాంత్, ఆదినారాయణ, రాజశేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణ దినోత్సవం

మణుగూరురూరల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ నుంచి పట్టణ ప్రధాన రహదారి పై పిహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో డ్రైడే పాటిద్దాం.. దోమలను లార్వా దశలోనే నిర్మూలిద్దాం.. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకుందాం.. డెంగీని తరిమికొడదాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో పిహెచ్‌సీ డాక్టర్ నిశాంత్‌రావు, ఏఎంఓ గొంది వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ, ఎస్‌యుఓ లింగ్యానాయక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: వినాయకపురంలో అవగాహన ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

చర్లరూరల్: జతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని సత్యనారాయణపురం, కొయ్యూరు పీహెచ్‌సీల వైద్యుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు డెంగీ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా చేసుకోవాలని వివరించారు. ర్యాలీ కార్యక్రమాల్లో కొయ్యూరు హోమియోపతి వైద్యురాలు పూజ, డీపీఎంఓ సత్యనారాయణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామలక్ష్మి, కొయ్యూరు, సత్యనారాయణపురం సిబ్బంది హనుమంతు, వేణు గోపాలకృష్ణ, ఎంపీఆర్ ప్రసాద్, రామకృష్ణ, పద్మావతి, బాబూరావు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: డెంగీపై అవగాహన కల్పించడం వల్ల పెద్ద నష్టాన్ని అరికట్టవచ్చని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ రేణుకారెడ్డి అన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేణుకారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో హోమియోపతి డాక్టర్ రాజేష్, వైద్యశాల సిబ్బంది నాగేశ్వరరావు, సురేష్, ఆశావర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: దోమల నివారణతో డెంగీ వ్యాధి నిర్మూలన సాధ్యమని కరకగూడెం ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి కారం మధు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించి కూడళ్ల వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ రాందాస్ నాయక్, డాక్టర్ మధుళిక మాట్లాడుతూ.. డెంగీ జ్వరాలకు దోమలే ప్రధాన కారణమని, వాటిని నివారిస్తే డెంగీని నివారించవచ్చని అన్నారు. కార్యక్రమాల్లో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్ఈఓ రాజు, హెచ్ఎస్ శ్రీనివాసరావు, హెచ్‌వీ దుర్గమ్మ, ఎల్‌టీ శారద, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో గురువారం వైద్యాధికారులు డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీని నిర్వహించి, డెంగీ వ్యాధి నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ.. డెంగీ జ్వరం ఎడీస్ ఈజీ టై అని పిలువబడే టైగర్ దోమ కుట్టడం వల్ల వస్తుందని, రాబోయే వర్షాకాలంలో ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల అభివృద్ధి చెందే ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ర్యాలీలో వైద్య సిబ్బంది హెచ్ఈఓ కృష్ణయ్య, డీపీఎంఓ ముత్యాలరావు, హెచ్‌వీ సద్గుణవాణి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కరకగూడెంలో మానవహారం నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది


భద్రాచలంఅర్బన్: డెంగీ నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకం తనుజా మాట్లాడుతూ.. డెంగీ జ్వరం దాని లక్షణాలు, అది సోకకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను ఆమె వివరించారు. వైద్యసిబ్బంది యండి.ఇమాం, శోభరాణి, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.


చంద్రుగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది


దుమ్ముగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న పర్ణశాల వైద్యశాల బృందం


చర్లరూరల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ దృశ్యం..